

# భవానీద్వీపం

## - వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 55 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'గుప్పు'న ఘాటైన పరిమళం ఒకటి కమ్ముకున్నది. వందల కడవలకొద్దీ ఏదో ఘాటైన పరిమళ ద్రవ్యాన్ని గుమ్మరించిన అనుభూతి కలుగుతున్నది. తలనుండి మొదలై, ఏదో బరువైన కుంచెతో నెమ్మదిగా రాస్తూ కిందికి కిందికి దిగుతున్న స్పర్శ తెలుస్తున్నది. ఆ మెత్తదనంలో ఏదో కరుకుదనం వున్న విచిత్రమైన అనుభూతి కలుగుతున్నది. పొరలు పొరలుగా, మెత్తగా పాకుతున్నట్లు ఆ కుంచె నెమ్మదిగా తలనుండి పాదాలదాకా అల్లుకుంటూ కిందికి కిందికి పాదరసంలా జారుతున్నది. పట్టు పరదాలా మెత్తగా అల్లుకుంటూ పైనుండి కిందికి జారుతున్నది.

పూలగొలుసేదో మెత్తగా గట్టిగా అల్లుకుంటున్న అనుభూతి. మల్లెపూల చంద్రహారం మొలకు చుట్టుకుంటున్న భావం కలిగింది. పరవశమైన మత్తు కలుగుతున్నది ఆ పరిమళానికి. మనసును వశపరుచుకునే మత్తు. ఒళ్లంతా తీయగా తిమ్మిరెక్కినట్లు అనిపించే మత్తు. దేనికో ఆరాటపడుతున్నది మనసు. నరనరాలు హాయితో మెలికలు తిరుగుతున్న తీయని బాధ సలుపుతున్నది. నెమ్మది నెమ్మదిగా

కలవరిస్తున్నట్లు మైకంతో తను చేస్తున్న సన్నని మూలుగు తనక్షే వినిపిస్తున్నది. కనులు మత్తుతోనో నిద్రతోనో అరమూతలు పడ్డాయి. కనులముందు ఒక మోహన రూపం ప్రత్యక్షమైంది.

ఆ అందం మానవకాంతల అందం కాదు. పాల నురుగులాంటి తెల్లనివస్త్రం ధరించింది. వజ్రాలు పొదిగిన అద్భుతమైన నీలిరత్నం సిగలో ధరించింది.ఆ నీలికాంతులు మత్తును గొలుపుతున్నాయి. గాలికి తొలిగిందో, వాలుగా వీలుగా జారిందో అలలు అలలుగా పవిట అందంగా జారిపోయింది. ఏమి అందం అది. మన్మథసామ్రాజ్యానికి అభిషేకం చేయడానికి సిద్ధం చేసిన కలశాలలా వున్నాయి ఎత్తైన పాలిండ్లు. గండుచేపలలాంటి కనులు తళతళలాడుతున్నాయి. కిందిపెదవిని ఓరగా కోరగా నొక్కిపట్టిన దంతాలు తెల్లగా మిలలాడుతున్నాయి. ముద్దుగా వంకర తిరిగిన చెంపమీద కందిగింజంత నల్లని మచ్చ దిష్టిచుక్కలా వున్నది.

ఆమె వేడి ఊపిరి సెగలు ముఖానికి తగులుతున్నాయి. కనులలో చెమ్మ కనిపిస్తున్నది. కోరికతో ఎగిసిపడుతున్న వక్షోజాల బరువు రవిక తట్టుకోలేకపోయింది. రవికను బిగించి కట్టిన పట్టు కుచ్చులు ఇక మా వల్ల కాదని పక్కున నవ్వినట్లు తెగిపోయ్యాయి. గట్లు తెంచుకున్న శృంగార ప్రవాహం అలలై ఎగిసింది. పరువపు పాలకడలిలో రెండు మంధరపర్వతాలలా, కట్లు తెంచుకున్న మదపుటేనుగులలా పాలిండ్లు దూకాయి.

చప్పున మెలకువ వచ్చింది. కనులు తెరుచుకోగానే కనిపించిన దృశ్యం గుండె ఆగిపోయేలా చేసింది ఒక నిముషంపాటు. బొడ్డునుండి మొదలైన కెవ్వుమన్న కేక గొంతులోనే ఆగిపోయి ఊపిరి ఆడకుండా అయిపోయాడు. ముఖం మీద వూగిసలాడుతున్న మహాసర్పం పడగ కనిపించింది. ముదురు నీలిరంగు కనులు మిలమిలా మెరుస్తున్నాయి. తెరచాపలా పడగను వూపుతూ తలను పైకెత్తి నోరు తెరిచినప్పుడు చిటికెన వ్రేళ్ళ పరిమాణంలో వున్న కోరలు తెల్లగా మెరుస్తున్నాయి. చీలిన ఎఱ్ఱని నాలుక అగ్నిశిఖల్లా ఎగురుతున్నది. అంతలోనే చివాలున తెల్ల మబ్బులా క్రిందికి దిగింది పడగ.

అసంకల్పితంగా మెరుపులా లేచిన ఎడమచేతితో దాని గొంతును పట్టుకున్నాడు. కప్పుకున్న దుప్పటిని ఒక్క ఉదుటున కుడిచేతితో లాగి పారేయడానికి ప్రయత్నిస్తూ లేచి కూర్చున్నాడు. భయంతో, ఆశ్చర్యంతో కూడిన కేకలు యిప్పుడు గొంతును దాటి బయటకు వచ్చాయి. లాగిపారేసే అవసరం లేకుండా, తన వొంటిమీద కప్పుకున్న దుప్పటి పక్కకు పడివున్నది. అంతేకాదు. తన నడుము కింది భాగంనుండీ నగ్నంగా వున్నాడు తను. గోచీతో సహా చేతితో లాగి పక్కన పడేసినట్లు ధోవతీ పక్కన పడివున్నది!

నడుమును చుట్టుకుని, కిందికి దిగి, ఎడమ తొడనుండి పిక్కలదాకా పెనవేసుకుని, దాని తోక..తన.. తన.. పురుషావయవాన్ని బలంగా పాముతున్నట్లు కదులుతున్నది. ఒళ్లంతా కంపరంతో, భయంతో వణికిపోతూ కేకలు పెడుతూనే లేచి నిల్చున్నాడు. కుడిచేతితో దాని నడుమును పట్టుకుని బలవంతంగా లాగి రెండు చేతుల బలంతో ఒకేసారి విసిరి వేశాడు. వెళ్లి దబ్బున శబ్దంచేస్తూ ద్వారం వద్ద పడ్డది. ఆ తాకిడికి వత్తి తగ్గించి పెట్టిన చమురుదీపం రెపరెపలాడింది. అదృష్టవశాత్తూ ఆరిపోలేదు.

దీపపు వెలుగులో తెల్లగా మెరిసిపోతున్న దాని పరిమాణాన్ని పూర్తిగా చూసి గుండెలు అవిసిపోయినాయి. దాదాపూ పది మూరల పొడవున్న తెల్ల త్రాచు అది. మసక వెలుతురులో మరింత భయంకరంగా కనిపిస్తున్నది. అరుపులు వినపడి ఎవరో పరుగున వస్తున్న ధ్వని వినిపించింది. చివాలున లేచి పడగవిప్పి వెనక్కు చూసింది అది. తీర్చి దిద్దినట్లుగా స్వస్తిక చిహ్నం స్పష్టంగా కనిపించింది చాటంత పడగమీద.

ద్వారం వద్ద అలికిడి వినిపించింది. తలుపులు తీవ్రంగా తట్టిన ధ్వని వినిపించింది. 'లక్ష్మీధరా! లక్ష్మీధరా!' అని ఆందోళనగా పిలుపులు వినిపించాయి. రెండే క్షణాలు. తలుపులు విరిగేలా బలంగా తట్టిన ధ్వనులు ఆగిపోయాయి. ద్వారానికి రెండుప్రక్కలా కిటికీలు వున్నాయి. కుడిపక్కనున్న కిటికీ తలుపులు బలంగా నెట్టినట్లు విసురుగా తెరుచుకున్నాయి. చువ్వలగుండా లోపలకు తొంగి చూసిన ముఖాలు భయంతో గావుకేకలు పెట్టాయి. 'పాము..పాము.. త్రాచు..త్రాచు' అనే అరుపులతో ప్రాంగణం అంతా దద్దరిల్లిపోయింది.

తెల్లని మెరుపులా పడగను క్రిందికి దించింది త్రాచు. అప్పుడు గమనించాడు లక్ష్మీధరుడు. ఈ ప్రక్కన దక్షిణం వైపు గోడకున్న కిటికీ తెరిచి వున్నది. తెల్లని తీగలా మెరిసింది త్రాచు. కళ్ళు మూసి తెరిచేలోపు ఆ కిటికీని సమీపించింది. కిటికీ నిలువునా లేచి పడగ విప్పి వెనక్కు తిరిగింది. ఒక క్షణం పాటు నిశ్చలంగా లక్ష్మీ ధరుడినే చూస్తూ వుండిపోయింది. రెండవ క్షణంలో కిటికీలోనుండి అదృశ్యమైంది. కిటికీలోనుండి చూస్తూ పెద్దగా అరుస్తూనే వున్నారు బయట వున్నవాళ్ళు.

తానింకా నగ్నంగానే వున్న సంగతి అప్పుడు గమనించాడు లక్ష్మీధరుడు. చప్పున వంగి ధోవతీ  చుట్టుకున్నాడు. అది వెళ్ళిన కిటికీవైపే చూస్తూ వణుకుతున్న కాళ్ళతో పరుగున వెళ్ళి తలుపులు తెరిచాడు. ఒక్కసారిగా లోపలికి దూకినట్లు అడుగుపెట్టారు లక్ష్మీధరుడి తండ్రీ, తమ్ముడు. వారి చేతులలో బలమైన కర్రలున్నాయి. ముఖంలో భయాందోళనలు వున్నాయి. చప్పున వెళ్ళి దీపం వత్తిని పెద్దదిగా చేశాడు అతడి తమ్ముడు.

స్పష్టమైన కాంతిలో మూలలు వెతుకున్న తండ్రికి, తమ్ముడికి కిటికీ చూపించాడు లక్ష్మీధరుడు. 'ఆ కిటికీలోనుండి వెళ్ళిపోయింది' అన్నాడు. అతడి గొంతు కంపించిది. ఒళ్లంతా నిలువునా వణికిపోతూనే వున్నది యింకా. దగ్గరికి వచ్చి భుజం మీద చేయి వేసి ఏదో చెప్పబోయాడు తండ్రి. 'అబ్బ! ఏమిటీ వాసన?' అన్నాడు ఒక్కసారిగా. తన నడుముకు, తొడకు, పిక్కలదాకా తెల్లగా మెరిసిన కస్తూరిలాంటి తడి గుర్తుకొచ్చింది లక్ష్మీధరుడికి. వంగి పిక్కలను తడిమి చూసుకున్నాడు. యింకా చెమ్మగా, జిగటగా తగుల్తూనే వున్నది. చేతిని వాసన చూశాడు. అదే, అది ఆ సువాసనే! తన నడుమును, తొడను పెనవేసి, తన.. బలంగా తడుముతూ, అలలా ఎగిసిపడుతున్న త్రాచు తోక కళ్ళముందు  మెదిలింది లక్ష్మీధరుడికి. కళ్ళు తిరిగి తూలి పడిపోయాడు. చప్పున ముందుకు దూకి, తండ్రికి తోడుగా అన్నను పట్టుకున్నాడు అతడి తమ్ముడు.

★★★★

చెప్పటం ఆపి మౌనం వహించాడు అక్కుభొట్లు. మౌనంగా కనులుమూసుకుని వింటున్నాడు భాస్కర రాయలవారు. చెప్పడం ఆగిపోవడంతో కనులు తెరిచాడు. అర్ధమైంది అన్నట్లుగా తలపంకించాడు. ఆయన చూపులు లక్ష్మీధరుడి మీదికి మళ్ళాయి. సిగ్గుతో అన్నట్లు తలను వాల్చుకుని వున్నాడా యువకుడు. 'ఆ తరువాత కూడా రెండు సార్లు నా వెంటపడింది స్వామీ!' అన్నాడు చివ్వున తల ఎత్తి. చిరునవ్వుతో 'నిన్ను మోహించింది నాయనా' అన్నాడు భాస్కరరాయలు. అసలే ఎర్రనైన లక్ష్మీధరుడి ముఖం యింకా ఎర్రబడింది.

'మీరేమీ ప్రతిక్రియలు ప్రయత్నం చేయలేదా?' అని అక్కుభొట్లను ప్రశ్నించాడు భాస్కరరాయలు.

'చెయ్యకేం? విప్ప పుల్లలూ, అతిమధురమూ మంట వేశాము. గరుడచూడామణి ప్రయత్నం చేశాము' అన్నాడు అక్కుభొట్లు. 'కొంత కాలమే! తరువాత మామూలే..' అని, నిష్ప్రయోజనమైంది అన్నట్లు పెదవి విరిచాడు.

(దూసరి తీగ / చీపురు తీగ వేరును నూరిన పసరు నీటిలో కలిపి తాగడాన్ని గరుడచూడామణి అని నాటువైద్యంలో వ్యవహరిస్తారు. అలా తాగినవారిని ఆరు నెలలవరకూ ఏ విషసర్పమూ సమీపించలేదు. తీగవేళ్ళను ద్వారానికి తోరణంలా వ్రేలాడ తీసినా ఆ యింటి చాయలకు సర్పాలు రావు అని సర్పశాస్త్రం చెబుతుంది)

'దిరిసెన వేరుతో, తెల్ల జిల్లేడు, తెల్ల గలిజేరుతో ..చెప్పిన పద్ధతులన్నీ ప్రయత్నం చేశాను' చివ్వున తల ఎత్తి దీనంగా చెప్పాడు లక్ష్మీధరుడు. కొంతకాలమే కనబడకుండా పోయింది. అదీ ఈ నాటు చికిత్సలవలన అనిపించలేదు నాకు. తరువాత మరలా వెంటబడడం మొదలు' అన్నాడు. మెచ్చుకోలుగా చూశాడు భాస్కరరాయలు అతడిని.

కొంతసేపు మౌనం నెలకొన్నది కుటీరంలో. 'మంత్ర తంత్ర ప్రయోగాలలో తమరిని మించినవారు లేరని మిమ్మల్ని ఆశ్రయించాము' అన్నాడు అక్కుభొట్లు. ' ఈ చికిత్సలు, తంత్రాలు ఆ తల్లిని ఏమీ చేయలేవు' అన్నాడు భాస్కరరాయలు. ఆయన కంఠధ్వనిలో ఏదో మార్పు వినిపించి వంచిన తలలు ఎత్తారు శ్రోతలు యిద్దరూ. ఆయన చూపు వారివైపు లేదు. ఆయన చూస్తున్నవైపే చూసిన వారిద్దరూ నిలువునా చలించిపోయారు. గంగానదిమీదినుండి చల్లగాలిని అందిస్తున్న గవాక్షంవైపే ప్రశాంతంగా చూస్తున్నాడు భాస్కరరయలవారు. కిటికీలోనుండి ఆరుమూరల పొడవున లోపలికి జారి, పడగ ఎత్తి చూస్తున్నది తెల్ల త్రాచు. సగం కిటికీ బయటే వున్నది. పడగను తిప్పి లక్ష్మీధరుడిని చూసింది తదేకంగా. నెమ్మదిగా, నెమ్మదిగా పూర్తిగా లోపలకు జారింది.

'అక్కడే ఆగిపో తల్లీ!' అన్నాడు భాస్కరరయలవారు, మనిషితో మాట్లాడుతున్నట్లుగా. మృదువుగా శాసిస్తున్నట్లుగా వున్నది ఆయన కంఠం. ముందుకు పాకబోయిన సర్పం మూడు చుట్టలు చుట్టుకుని, నిలువునా పడగలేపి నిశ్చలంగా ఆయననే చూడడం మొదలెట్టింది.

'నీవలన భయంలేదు తల్లీ! నాకు తెలుసు! కానీ ఆ దుర్మార్గుడు బయలుదేరాడు నిన్ను వెతుకుతూ! నువ్వు దక్కడంలేదని కసిగా వెంటబడుతూనే వున్నాడు! ఒకటి, రెండు వందల ఏళ్ళుగా కాదు. వేల సంవత్సరాలుగా!' ఆశ్చర్యం! ఆయన మాటలను సాటిమనిషిలా అర్థం చేసుకున్నదానిలా చివ్వున పడగ తిప్పి తను వచ్చిన కిటికీవైపు చూసిందా మహా సర్పం. ముదురు నీలం రంగులో ముగ్గువేసినట్లుగా స్వస్తిక్ చిహ్నం కొట్టొచ్చినట్లు కనిపించింది, పెద్ద అరిటాకంత వెడల్పున్న పడగమీద. మరలా తల తిప్పి భాస్కరరాయలవారినే చూడసాగింది.

అర్థం చేసుకున్నట్లుగా 'అతడు రావడానికి యింకా సమయమున్నది తల్లీ! రాకముందే నువ్వు వెళ్ళిపో! తెలియక జరిగిన పొరబాటుకు యింకా ఎన్ని జన్మలు నీకీ వ్యామోహం?' అన్నాడు భాస్కరరాయలవారు నచ్చ చెబుతున్నట్లుగా. చివ్వున తల తిప్పి లక్ష్మీధరుడిని లిప్తపాటు చూసిందా సర్పం. పడగ దింపి మెరుపులా అంతెత్తునవున్న కిటికీలోనుండి మాయమైంది.

కొంతసేపు అటువైపే చూస్తూ వుండిపోయాడు భాస్కరరాయలవారు. తలతిప్పి సుడిగాలిలో లేత తీగలలాగా నిలువునా వణికిపోతున్న అక్కుభొట్లను, లక్ష్మీధరుడినీ ఉద్దేశించి 'నా వద్దకు రావడంలో ఏమాత్రం ఆలస్యమైనా తీవ్రమైన ప్రమాదం జరిగేది. మంచిపని చేశారు' అన్నాడు. మాటలు పెకలక వణుకుతున్న వారి మనసులో ప్రశ్నలను అర్థం చేసుకున్నట్లుగా 'తక్షక జాతికి చెందిన దేవతాసర్పం! లక్ష్మీధరా! రెండువేల సంవత్సరాలుగా నీమీది వ్యామోహంతో, నిన్ను వదలలేక వెంటబడుతున్నది' అన్నాడు. ఆయన కంఠం సమ్మోహనకరమైన మంత్రపఠనం చేస్తున్నట్లు మోగుతున్నది. ఆయన ముఖం నుండి వెలువడుతున్న దివ్యమైన కాంతులు కుటీరాన్ని ధగధగలాడే కాంతులతో అభిషేకిస్తున్నాయి. ఏదో కలలో వింటున్నట్లుగా వింటున్నారు అక్కుభొట్లు, లక్ష్మీధరుడు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS